క్లుప్తంగా

బీఆర్ఎస్ పాలనలో రైతులకు అన్యాయం

జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి



కందుకూరు: రైతాంగ వ్యతిరేక చర్యలు అంటూ బీఆర్ఎస్ నాయకులు గగ్గోలు పెట్టడం విడ్డూరంగా ఉందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి విమర్శించారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ పదేళ్ల పాలనలో నాడు ధాన్యం తడిస్తే కొనే దిక్కేలేదన్నారు. అకాల వర్షాలతో పంట నష్టం జరిగితే పైసా సహాయం చేయలేదు, అలాగే పంటల బీమా పథకం నిర్వీర్యం చేశారన్నారు. 2018 ఎన్నికల మేనిఫెస్టోలో రూ.లక్ష రుణ మాఫీ చేస్తామని మాట ఇచ్చి 2023 ఆగస్టు వరకు దాని ఊసే ఎత్తలేదన్నారు. ఎన్నికలు వస్తున్నాయని మొదలు పెట్టిన రుణమాఫీ రైతులకు చేరనే లేదన్నారు. వంద రోజుల కాంగ్రెస్ పాలనలో రైతు భరోసా కింద రూ.7500 కోట్లు వేశామన్నారు. ఆగష్టు 15 లోపు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీకి కార్యాచరణ ప్రకటించి, వచ్చే పంట నుంచి క్వింటాశ్‌కు రూ.500 బోనస్ ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. అన్ని చేస్తున్నా ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు విమర్శించడం, నిరసనలకు దిగడం సిగ్గుచేటన్నారు.

వెల్డన్ స్టూడెంట్స్



విద్యార్థులతో డీపీఎస్ విద్యాసంస్థల అధినేత కొమురయ్య

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పదో తరగతి (సీబీఎస్ఈ) విద్యార్థులు గురువారం సమావేశమయ్యారు. ఇటీవల విడుదలైన పరీక్షా ఫలితాల్లో ఉత్తమ గ్రేడ్లు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ తురగ పద్మ జ్యోతి అభినందించారు. కార్యక్రమంలో డీపీఎస్, పల్లవి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ మల్కా కొమరయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ ఎంపీటీసీ మృతి



యాదయ్య (ఫైల్)

కందుకూరు: మండల పరిధిలోని లేమూరు మాజీ ఎంపీటీసీ సభ్యుడు గొరిగె యాదయ్య(70) గురువారం మధ్యాహ్నం గుండె పోటుతో మృతి చెందారు. ఆయన 2009–14 మధ్య ఐదేళ్ల పాటు ఎంపీటీసీగా సేవలందించారు. ఆయనకు భార్యతో పాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

దేవాలయ భూమి అక్రమ రిజిస్ట్రేషన్

అధికారులకు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు



అదనపు కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామ శివారులో ఉన్న అంబ భవానీ మాత దేవాలయానికి సంబంధించిన భూమిని కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని పలువురు గ్రామస్తులు గురువారం దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ కృష్ణవేణిని కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ప్రతులను స్థానిక విలేకరులకు అందజేశారు. ఎలికట్ట గ్రామ శివారులోని అంబభవానీ మాత దేవాలయానికి సంబంధించిన భూమి సర్వే నెంబర్ 441లో 3 ఎకరాల 28 గుంటలు ఉందని పేర్కొన్నారు. అయితే ఈ భూమి దేవాదాయ శాఖకు సంబంధించి 43 రిజిస్టర్‌లో నమోదు చేయబడి ఉందని పేర్కొన్నారు. ఈ భూమిని 2015లో తుమ్మలపల్లి గుల్లె కృష్ణయ్య తన పేరున అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని, ప్రస్తుతం తిరిగి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత మార్కెట్‌లో ఈ భూమి విలువ రూ.15కోట్ల వరకు ఉందని, దేవాలయానికి సంబంధించిన భూములను నిబంధనలకు విరుద్ధంగా అమ్మినవారు, కొన్న వారిపై చర్యలు తీసుకొని దేవాలయ భూములను కాపాడాలని పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో ఎంపీటీసీ కావలి శ్రీశైలం, సంజీవయాదవ్, ఆర్ల యాదయ్య, రాజు, నారం రాంరెడ్డి, కృష్ణయ్య యాదవ్, శివ, శర్వలింగం, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

పచ్చళ్లకు ధరల పోటు!

ఒక్కో మామిడి కాయకు రూ.15-20

- అదే బాటలో వంటనూనె, అల్లంవెల్లుల్లి
- విలవిలలాడుతున్న సామాన్యులు





అమ్మకానికి సిద్ధంగా ఉన్న పచ్చడి కాయలు, పచ్చడి కాయలు కట్ చేస్తున్న వ్యాపారి

హుడాకాంప్లెక్స్: పచ్చళ్లకు ధరల సెగలు తగులుతున్నాయి. ప్రస్తుతం మామిడ్ సీజన్ కావడం, ప్రతి ఇంట్లోనూ ఆవకాయ పచ్చడి పెట్టడం సర్వసాధారణం. ఏడాదంతా నిల్వ ఉండేలా ఏర్పాటు చేసుకునే ఈ పచ్చళ్లు.. పేద, మధ్య తరగతికి మార్కెట్లో పెరిగిన ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. అంతేకాదు ఇంట్లో పచ్చళ్లు పెట్టి దేశ, విదేశాల్లో స్థిరపడిన తమ పిల్లలకు పార్శిళ్లు పంపేవారు సైతం ఈ సారి వెనుకాడుతుండటం గమనార్హం.

దెబ్బతిన్న పంట

గత ఏడాదితో పోలిస్తే మామిడి కాయ దిగుబడి భారీగా తగ్గింది. దీనికి తోడు ఇటీవల కురిసిన ఈదురు గాలితో కూడిన వర్షాలు పంటను దెబ్బతీశాయి. డిమాండ్ మేరకు ఉత్పత్తి లేకపోవడంతో మార్కెట్లో మామిడి ధరలు భగ్గుమంటున్నాయి. పావు కేజీ కాయకు రూ.15 నుంచి 20 వరకు పలుకుతోంది. అంతేకాదు ఎండు మిర్చి కేజీ ధర రూ.200, అల్లం కేజీ రూ.160, వెల్లుల్లి కేజీ ధర రూ.270 వరకు పెరిగాయి. ఇక ఆయిల్ ధరలు కూడా భారీగా పెరిగాయి. పల్లి నూనె కేజీ రూ.180 పలుకుతుండగా, పొద్దుతిరుగుడు రూ.140–160 వరకు పలుకుతోంది.

పోపు గింజలు ప్రియం

అంతేకాదు మార్కెట్లో కొనుగోలు చేసిన కాయలను కట్ చేసే ప్రక్రియ కూడా ఖరీదుగా మారింది. ఒక్కో కాయకు రూ.5 చొప్పున తీసుకుంటున్నారు. ప్రస్తుతం పెరిగిన ఈ ధరల ఘాటుకి పోపు గింజలు కూడా మాడిపోతున్నాయి. పెరిగిన ఈ ధరలతో మెజార్టీ వినియోగదారులు పచ్చళ్లు పెట్టడం కంటే మానుకోవడమే ఉత్తమమని భావిస్తున్నారు. గతంలో వంద కాయలు పచ్చడి పెట్టిన వారు.. ప్రస్తుతం 50 కాయలతోనే సరిపెట్టుకోవాల్సి వస్తుంది.

20 కాయలతోనే సరిపెట్టుకున్నా



మార్కెట్లో మామిడి ప్రియమైంది. పండ్ల ధర కేజీ రూ.80 నుంచి రూ.100 పలుకుతోంది. ఇక పచ్చడి కాయలు దొరకడమే గగనమైంది. ఒకే చెట్టు కాయలు లభించడం లేదు. గతంలో 100 కాయల వరకు పెట్టేవాళ్లం. ఈసారి మాత్రం 20 కాయలతో సరిపెట్టుకున్నాం. కారం ధరలు కూడా అమాంతం పెరిగాయి.

– కృష్ణవేణి, గృహిణి, బడంగ్‌పేట్

దిగుబడి తగ్గింది

ఏటా చెట్టు విరగబడి కాసేది. ఈసారి పూత, కాత లేదు. దిగుబడి లేకపోవడంతో ఇప్పటి వరకు ఇంటి మామిడి చెట్టు కాయలతో పచ్చడి పెట్టిన తాము కూడా ఈసారి మార్కెట్లో లభించే కాయలపై ఆధారపడాల్సి వచ్చింది. మార్కెట్లో కూడా ఆశించిన స్థాయిలో కాయలు లేవు.

– బాబురావు, జనప్రియకాలనీ, బాలాపూర్



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు

షాద్‌నగర్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటారని హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ఫరూఖ్‌నగర్‌లోని పురవీధుల గుండా ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఫరూఖ్‌నగర్‌లోని గాంధీ విగ్రహం వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఎడిస్ అనే దోమ కాటు కారణంగా డెంగీ వస్తుందన్నారు. ఈ దోమ ఎక్కువగా చీకటి ఉండే ప్రాంతంలో, మంచి నీటిలో వృద్ధి చెందుతా యన్నారు. దోమ పగటి పూట మాత్రమే కుడుతుందని, వ్యాధి వచ్చిన వారికి అకస్మాత్తుగా తీవ్రంగా జ్వరం రావడం, తీవ్రమైన తలనొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు, ఆకలి మందగిస్తుందని తెలిపారు. ఒక్కోసారి ప్రాణాంతకంగా మారే అవకాశాలు ఉంటాయన్నారు. ఈ లక్షణాలు కనిపించిన వారు వెంటనే సమీపంలో ఉండే వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలని సూచించారు. అదేవిధంగా దోమల నివారణ కోసం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్లలో విధిగా దోమ తెరలను ఉపయోగించాలని తద్వారా దోమలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు కార్తీక్, జగదీశ్, సంధ్య, ప్రవీణ, హెల్త్ సూపర్‌వైజర్లు చంద్రకళ, ఆస్పత్రి ఆఫీసర్ శ్రీహరి, అమృత, ఉదయ్‌కుమార్, ఝాన్సీ, గౌస్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన శంకర్‌పల్లి మండల నాయకులు

చేవెళ్ల: శంకర్‌పల్లి మండలంలో బీఆర్ఎస్ పార్టీని నడిపించే నాయకులు కరువయ్యారు మా పరిస్థితి అగమ్యగోచరంగా మారింది మీరే మాకు మార్గనిర్దేశం చేయాలంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను శంకర్‌పల్లి మండలంలోని శేరిగూడ మాజీ సర్పంచ్ సత్యనారాయణ, గ్రామ నాయకులు కోరారు. గురువారం నగరంలో కేటీఆర్‌ను శేరిగూడం మాజీసర్పంచ్ సత్యనారాయణ మాజీ ఉపసర్పంచ్ ఇంద్రాసేనారెడ్డి, మాజీ వార్డుసభ్యులు వెంకటేశ్, రాజేందర్, ప్రసాద్, యాదగిరి, గ్రామ యువకులు కలిశారు. ఈ సందర్భంగా వారు కేటీఆర్‌తో బీఆర్ఎస్ పార్టీ మండల పరిస్థితిని వివరించారు. గతంలో ఒక వెలుగు వెలిగిన శంకర్‌పల్లి మండలంలో ఇప్పుడు బీఆర్ఎస్ పరిస్థితి తారుమారైందన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, వైస్ ఎంపీపీ, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు అంతా పార్టీ మారారన్నారు. మా గోడు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావటం లేదని పేర్కొన్నారు. మండలంలో మాకు నాయకుడు ఎవరు అనేది తెలియకుండా పోయిందని మొర పెట్టుకున్నారు.

దంచికొట్టిన వాన



హిమాయత్‌నగర్ చౌరస్తాలో చెరువును తలపిస్తున్న రోడ్డు

- చెరువులు, కుంటలను తలపిస్తున్న రోడ్లు
- ఇబ్బందిపడ్డ వాహనదారులు, ప్రజలు



హిమాయత్‌నగర్‌లో వర్షం నీటితో ఇబ్బంది పడుతున్న మహిళలు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో వర్షం దంచికొట్టింది. గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో దాదాపు రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. మండల పరిధిలోని అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, ఎన్కెపల్లి, ముర్తుజాగూడ, అమ్డాపూర్, కాసీంబౌలి, బాకారం ఆయా గ్రామాల్లో కురిసిన వర్షానికి రోడ్లపై వరదనీరు భారీగా ప్రవహించింది. లోతట్టు రోడ్లపై వర్షం నీరు చేరడంతో కుంటలను తలపించాయి. ప్రజలు, వాహనాదారులు అనేక ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా హిమాయత్‌నగర్, అజీజ్‌నగర్ చౌరస్తాల్లో గల జాతీయ రహదారులపై భారీగా వర్షం నీరు చేరడంతో వాహనాదారులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు.

మొయినాబాద్: మండల కేంద్రంతో పాటు చిలుకూరు, అప్పోజీగూడ, చందానగర్, రెడ్డిపల్లి, పెద్దమంగళారం, సురంగల్, ముర్తూజగూడ తదితర గ్రామాల్లో గురువారం సాయంత్రం మోస్తారు వర్షం కురిసింది. నిన్నమొన్నటి వరకు ఎండలతో అల్లాడిన ప్రజలకు వర్షం కాస్త ఉపశమనం కలిగించింది.

ఆర్థికసాయం

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లికి చెందిన వెంకట్‌రెడ్డి(64) అనారోగ్యానికి గురై గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదే విధంగా మండల కేంద్రానికి చెందిన కృష్ణయ్య, రామచంద్రయ్య ఇటీవల మృతిచెందగా.. ప్రభాకర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఒక్కొక్కరికి రూ.3వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్‌రెడ్డి, డేవిడ్, జమోహన్‌రెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

మంచాల: గ్రామీణ ప్రాంతాల్లోని యువతీయువకులు ఉచిత సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని మంచాల పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ అన్నారు. గురువారం మంచాల ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థులు వేసవి సెలవుల్లో క్రీడల్లో చురుకుగా పాల్గొనాలని కోరారు. 14 సంవత్సరాలలోపు బాలబాలికలకు సమ్మర్ క్యాంప్‌లో కబడ్డీ, వాలీబాల్ క్రీడలు నేర్పిస్తారన్నారు. ఈ క్యాంప్ నిర్వహణకు ముందుకు వచ్చిన పీఈటీలు వెంకటేశ్, గిరి ప్రసాద్‌ను ఆయన అభినందించారు.



సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న రాజ్‌కుమార్, క్రీడాకారులు

డెంగీపై అవగాహన అవసరం



కొత్తూరు: అవగాహన ర్యాలీ..

పీహెచ్‌సీ వైద్యుడు కిషన్

కొత్తూరు: డెంగీ వ్యాధి వ్యాప్తిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు హరికిషన్ అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ఆయన పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి కొత్తూరు పట్టణంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దోమలు కుట్టడం ద్వారా ఈ వ్యాధి సంక్రమిస్తుందని వివరించారు. వ్యాధి బారిన పడిన వారికి జ్వరం, తలనొప్పి, కండరాలు నొప్పులు ఉంటాయన్నారు. ధిది బారిన పడితే నిర్లక్ష్యం చేయకుండా వైద్య పరీక్షలు చేయించుకొని చికిత్సలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు తమ ఇంటి ఆవరణలో నీరు ఎక్కువ రోజులు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పూల కుండీలు, కొబ్బరి చిప్పల్లో నీరు నిల్వ ఉంటే డెంగీకి కారణమైయ్యే దోమలు వృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో వైద్యులు సరిత, మానస, ఝాన్సీ, ఉదయ్ కుమార్, రాము, ఏఎన్ఎంలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

బీజేపీ జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి

చేవెళ్ల: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి జి.వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని చనువెల్లి గ్రామంలో గురువారం నిజాముద్దీన్, వినయ్‌కుమార్‌ల స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగుపడుతాయని చెప్పారు. క్రీడాకారులు ఆటల్లో స్ఫూర్తిని ప్రదర్శించాలని గెలుపు ఓటమిలను సమానంగా తీసుకోవాలని సూచించారు. యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి టోర్నమెంట్‌లు దోహదపడతాయన్నారు. గ్రామీణ స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు క్రీడాకారులు ఎదగా లని కోరారు. ఈ టోర్నమెంట్ నిర్వాహకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, క్రీడాకారులు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌చారి, వెంకట్‌రెడ్డి, రాజేందర్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, భూపతిరెడ్డి, తిరుపతిరెడ్డి, జైపాల్‌రెడ్డి, వెంకట్ ఉన్నారు.

వరి ధాన్యానికి బోనస్ ఇవ్వాల్సిందే

మున్సిపల్ ఛైర్మన్ కొందూటి నరేందర్

షాద్‌నగర్: రైతులకు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం వరి ధాన్యానికి విధిగా రూ.500లు బోనస్ ఇవ్వాలని మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు మున్సిపల్ వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్ ఆధ్వర్యంలో గురువారం ఆ పార్టీ నాయకులు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండాలన్నారు. లేనిపక్షంలో రైతుల తరపున బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. అనంతరం మార్కెట్ సెక్రటరీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బక్కన్న యాదవ్, వెంకట్‌రెడ్డి, నారాయణ, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భీష్మ రామకృష్ణ, శ్రీశైలంయాదవ్, గోపాల్, చందునాయక్, కిరణ్, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్, శంకర్, నందీశ్వర్, రంగయ్య, కృష్ణ, రాఘవేందర్, వీరేశం పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

మట్టి దందా!

- రంగాపూర్ చెరువులో విచ్చలవిడిగా తవ్వకాలు
- ఇష్టారాజ్యంగా అక్రమ రవాణా
- చోద్యం చూస్తున్న అధికారులు



రంగాపూర్ చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు

నందిగామ: అనుమతుల్లేవ్.. అడిగేటోళ్లు లేరు.. ఇంకేముంది చెరువులను తవ్వేస్తున్నారు. రూ.లక్షల విలువచేసే మట్టిని దోచుకెళ్తున్నారు. ఇలా అక్రమార్కులకు మట్టి వ్యాపారం కాసుల వర్షం కురిపిస్తుండగా.. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ప్రభుత్వ సంపదను కాపాడాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా కొనసాగుతున్న ఈ అక్రమ మట్టి దందా మండలంలోని రంగాపూర్‌కు ఆనుకొని ఉన్న చెరువులో నిత్యాకృత్యమైంది. మండల కేంద్రమైన నందిగామకు కూతవేటు దూరంలో ఉన్న రంగాపూర్, సల్వేంద్రిగూడ గ్రామాల మధ్యలో ఉన్న చెరువులో నుంచి అక్రమంగా గత కొన్నిరోజులుగా మట్టిని తరలిస్తున్నారు. అధికారులు ఎన్నికల విధుల్లో ఉండటంతో అక్రమార్కులు తమ పనిని యథేచ్ఛగా కానిచ్చేశారు. పగలు రెండు జేసీబీలు, నాలుగు టిప్పర్ల ద్వారా, రాత్రయితే ఇటాచీ మరో 4 టిప్పర్లు అదనంగా పెట్టి ప్రభుత్వ చెరువులో నుంచి అక్రమంగా మట్టిని తవ్వి కొంతమంది ఇటుకబట్టీలకు విక్రయిస్తున్నారు. ఎన్నికలు పూర్తయినా కూడా అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడంపై స్థానికులు అధికారుల తీరుపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

టిప్పరుకు రూ.5 వేలు..

ప్రభుత్వ చెరువులో నుంచి అక్రమంగా మట్టిని తవ్వుతున్న అక్రమార్కులు 600 ఫీట్ల టిప్పరుకు రూ .5వేల చొప్పున విక్రయిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ప్రభుత్వ సంపదను కాపాడాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో వారు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. గ్రామాల్లో నిర్మిస్తున్న ఇళ్లలో బేస్‌మెంట్ నింపుకునేందుకు సమీపంలోని చెరువుల్లో నుంచి మట్టి తీస్తేనే అడ్డుకునే అధికారులు రంగాపూర్‌లో మాత్రం వేలాది ట్రిప్పులను తరలించుకుపోతున్నా కూడా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పగలు పంట పొలాలకు.. రాత్రి ఇటుక బట్టీలకు..

చెరువులో నుంచి అక్రమంగా మట్టిని తవ్వుతున్న అక్రమార్కులు పగలు మాత్రం కొన్ని ట్రిప్పులను సమీపంలోని పంట పొలాలకు తరలిస్తున్నారు. రాత్రి అయితే చాలు ఇటుక బట్టీలకు, పరిశ్రమల బేస్‌మెంట్‌లకు, రోడ్ల నిర్మాణాలకు తరలిస్తున్నారు. నిబంధనల ప్రకారం చెరువులో నుంచి మట్టిని తీయాలంటే సంబంధిత శాఖ అధికారులతో పాటు రెవెన్యూ అధికారుల అనుమతులు సైతం తీసుకొని, ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించి నిబంధనల మేరకు మట్టి తీసుకోవాలి. కానీ ఇక్కడ అలాంటి నిబంధనలు ఏ మాత్రం పట్టించుకోకుండా ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టి అక్రమంగా మట్టిని తరలిస్తున్నా కూడా అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు దారి తీస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రంగాపూర్ చెరువులో నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్తా..

రంగాపూర్ చెరువులో నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారనే విషయం మా దృష్టికి రాలేదు. ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి అక్రమ మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తా.

– రోజ, ఆర్ఐ, నందిగామ

చర్యలు తీసుకుంటాం..

అనుమతులు లేకుండా మట్టిని తీసుకెళ్లిన విషయం తమ దృష్టికి రాలేదు. చెరువును సందర్శించి అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం. రైతులకు మట్టి కావాల్సి వస్తే నిబంధనల మేరకు అనుమతులు తీసుకోవాలి.

– రవీందర్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈ